ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

ముఖ్యాంశాలు

- ఆరోగ్య సంరక్షణ రంగంలో వైద్యవిద్యా నైపుణ్యాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి జయంత్ చౌదరి పేర్కొన్నారు.
- ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు, విజయనగరం శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవం కొద్ది సేపటి క్రితం ఘనంగా ముగిసింది.
- మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.
- రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఇన్‌ఛార్జ్ మంత్రులను ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- దక్షిణ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

===================

ఆరోగ్య సంరక్షణ రంగంలో వైద్యవిద్యా నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడానికి AMTZతో భాగస్వామి కావడం ఎన్డీఏ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత, విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి అన్నారు. విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి ఈ రోజు స్థానిక మెడ్ టెక్ జోన్ లో భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ A.P.J అబ్దుల్ కలాం 93వ జయంతోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మరింత సమాచారాన్ని విశాఖపట్నం ఆకాశవాణి ప్రతినిధి వి సత్యనారాయణ మూర్తి అందిస్తారు...

బైట్: వి ఎస్ ఎన్ మూర్తి (వాయిస్ 28 సెకన్లు)

===================

రాష్ట్రంలో అత్యాచారాలకు, దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతి భద్రతలను మరింత పటిష్టంగా అమలు పర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ముఖ్యమైన కూడళ్లు, ప్రాంతాలలో సి.సి. కెమేరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సి.సి. కెమేరాలు లేని చోట్ల డ్రోన్ల సహకారంతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ సమావేశంలో డి.జి.పి. ద్వారకా తిరుమలరావు, లా అండ్ ఆర్డర్ ఐ.జి. శ్రీకాంత్ కూడా పాల్గొన్నారు.

=====================

ఉత్తరాంధ్ర ఇలవేల్పు, విజయనగరం ప్రజల ఆరాధ్య దేవత శ్రీ పైడితల్లి అమ్మవారి వార్షిక ఉత్సవాలలో భాగంగా ముఖ్య ఘట్టమైన సిరిమాను సంబరం కొద్ది సేపటి క్రితం ఘనంగా ముగిసింది. ఎంతో చారిత్రాత్మకమైన శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవానికి సంబంధించి సిరిమాను త్రాడును రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మొదటిగా లాగి ప్రారంభించారు. పాలధార, తెల్ల ఏనుగు, బెస్తవారి వల, అంజలి రథం ముందు నడవగా, విజయనగరం పుర వీధుల్లో అశేష జనవాహిని మధ్య పైడితల్లి అమ్మవారు ఊరేగారు. అమ్మవారికి ప్రతిరూపంగా పూజారి వెంకటరావు సిరిమానును అధిరోహించారు. ఆ వివరాలను మా ఆకాశవాణి ప్రతినిధి అందిస్తారు...

వాయిస్ బైట్ : పీవీఎస్ఎస్ ప్రసాద్ (వాయిస్ 44 సెకన్లు)

===================

రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఇన్‌ఛార్జ్ మంత్రులను ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
శ్రీకాకుళం-కొండపల్లి శ్రీనివాస్,
విజయనగరం-వంగలపూడి అనిత,
పార్వతీపురం మన్యం మరియు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు కె.అచ్చెన్నాయుడు,

విశాఖపట్నం-డోలా బాల వీరాంజనేయస్వామి,
అల్లూరి సీతారామరాజు - గుమ్మిడి సంధ్యారాణి,
అనకాపల్లి- కొల్లు రవీంద్ర,
కాకినాడ- పొంగూరు నారాయణ,
తూర్పుగోదావరి- నిమ్మల రామానాయుడు,
ఏలూరు- నాదెండ్ల మనోహర్,
పశ్చిమగోదావరి మరియు పల్నాడు- గొట్టిపాటి రవికుమార్,
ఎన్టీఆర్- సత్యకుమార్ యాదవ్,
కృష్ణా- వాసంశెట్టి సుభాష్,
గుంటూరు- కందుల దుర్గేష్,
బాపట్ల- కొలుసు పార్థసారథి,
ప్రకాశం- ఆనం రామనారాయణరెడ్డి,
నెల్లూరు- ఎన్ఎండీ ఫరూక్,
నంద్యాల- పయ్యావుల కేశవ్,
అనంతపురం- టీజీ భరత్,
శ్రీసత్యసాయి మరియు తిరుపతి- అనగాని సత్యప్రసాద్,
వైఎస్ఆర్- ఎస్.సవిత,
అన్నమయ్య- బీసీ జనార్దన్‌రెడ్డి,
చిత్తూరు- మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలను నియమించారు.

===================

విరామం

===================

దక్షిణ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాగల 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా పయనించి వాయుగుండముగా మారి నైరుతి బంగాళాఖాతములో బలపడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ వాయుగుండము తదుపరి 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు ప్రయాణించే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆ వివరాలను అమరావతిలోని భారత వాతావరణ అధికారి తెలియజేస్తూ..

వాయిస్ బైట్ : వాతావరణ అధికారి (వాయిస్ 26 సెకన్లు)

===================

బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం వాయుగుండంగా బలపడే అవకాశమున్నందున వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమయ్యిందని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ కె.పద్మావతి ఈ రోజు ప్రకటనలో తెలిపారు. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించినందున వైద్య ఆరోగ్య శాఖ తగు ముందస్తు చర్యల్ని తీసుకుందని ఆమె పేర్కొన్నాను. సంబంధిత జిల్లాల్లో ఉన్న ఎపిడెమిక్ కేంద్రాలు 24 గంటలూ అందుబాటులో ఉంచడంతో పాటు నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధాకారులను ఆదేశించామని తెలిపారు. పునరావాస శిబిరాల వద్ద ఇప్పటికే వైద్య శిబిరాల్ని ఏర్పాటు చేశామని డాక్టర్ పద్మావతి తెలిపారు.

===================

ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఇన్కమ్ టాక్స్ ప్రిన్సిపల్ కమీషనర్ సునీత బిళ్ళ తెలిపారు. స్వచ్ఛభారత్ దివస్ లో భాగంగా విజయవాడలో ఈ రోజు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్కమ్ టాక్స్ చీఫ్ కమిషర్ అమిత్ మెహతా, అంతర్జాతీయ తైక్వాండో క్రీడాకారిణి సింధు తపస్వి, ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సింధు తపస్వి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై సామాజిక స్పృహను ప్రతీ ఒక్కరూ కలిగియుండాలని పేర్కొంటూ..

వాయిస్ బైట్ : సింధు తపస్వీ (వాయిస్ 23 సెకన్లు)

===================

తుఫాను వల్ల ఎదురయ్యే పరిస్దితులను ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఒంగోలు జిల్లాలో తుఫాను పరిస్థితి, జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలపై ఈ రోజు స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ లో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సమీక్షలో జిల్లా అధికారులు, మండల స్దాయి ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాన్ వల్ల నష్టపోయే ప్రజలు, రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. తుఫానుకు సంబంధించి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు.

==================

సాంప్రదాయేతర ఇందన వనరుల ప్రోత్సాహంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పిఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణణ్ కోరారు. ప్రతి ఇంటికి సోలారు విద్యుత్ యూనిట్ ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కలెక్టరు కార్యాలయంలో ఈ రోజు ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం పై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ, ఈ పథకం గురించి విద్యుత్ శాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

===================

ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం మండలం కొమరాడ గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 80 లక్షల రూపాయల వ్యయంతో రెండు సిసి రోడ్ల నిర్మాణాలకు భీమవరం నియోజకవర్గ శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులుతో కలసి ఆమె ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సుమారు 51 కోట్ల రూపాయల విలువ కలిగిన 423 పనులను చేపట్టడం జరుగుతుందన్నారు.

===================

తిరుమలలో శ్రీవారి దర్శనానికి టోకెన్ లేని భక్తులకు ఆరు గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న అర్ధరాత్రి వరకు 75 వేల 361 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని పేర్కొన్నారు.

===================

===================